

సభలో ప్రసంగిస్తున్న ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ



తెలంగాణ జనగర్జన సభకు భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

కట్టడి చేసినా.. కదం తొక్కి..

జనగర్జన సభకు సంద్రంలా తరలివచ్చిన కాంగ్రెస్ కేడర్

- అభిమాన సందోహం మధ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్న పొంగులేటి
- ఖమ్మం వేదికగా ఎన్నికల శంఖారావాన్ని పూరించిన అధిష్టానం
- రూ.4 వేల పింఛన్ ప్రకటన చేసిన రాహుల్‌గాంధీ
- పాదయాత్ర ముగింపుతో భట్టికి ప్రశంసలతో సత్కారం
- జోష్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం గుమ్మంలో నిర్వహించిన జనగర్జన సభ పార్టీ శ్రేణులు, అభిమాన సంద్రంతో కదం తొక్కింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, వరంగల్, ములుగు జిల్లాల నుంచి నేతలు, కేడర్ వెల్లువలా తరలివచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సభా ప్రాంగణానికి కేడర్ తరలిరావడం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వాహనాల తనిఖీల పేరుతో కట్టడి చేసినా.. సభ ఊహించని స్థాయిలో సక్సెస్ అయిందన్న ఆనందం ఆ పార్టీ నేతల్లో ఉంది. అభిమాన సంద్రం మధ్య రాహుల్‌గాంధీ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టిన సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కకు రాహుల్ ప్రశంసలు అందడంతో పాటు సత్కారం చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వేదికగా జరిగిన తెలంగాణ జనగర్జన సభ రాష్ట్ర ఎన్నికలకు శంఖారావంగా మారిందని ఆ పార్టీ శ్రేణులు జోష్‌తో ఉన్నాయి.



సభావేదిక వద్ద దప్పు కళాకారిణి

దండుగా కదలివచ్చి..

సభకు ఉమ్మడి ఖమ్మంతో జిల్లాతోపాటు నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున నేతలతోపాటు శ్రేణులు తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సభా ప్రాంగణానికి దండుగా కదలిరావడం ప్రారంభం కాగా, ఆరు గంటల వరకు కూడా వస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీల పేరుతో పోలీసులు వాహనాలను నిలిపారు. దీనిపై పార్టీ శ్రేణులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా చెక్‌పోస్టులను తీయడంతో వాహనాల రాక ప్రారంభమైంది. తల్లాడ నుంచి ఎస్‌ఆర్ గార్డెన్ వరకు, ఖమ్మంలోని ఇల్లెందు రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయింది.

భట్టికి సన్మానం చేసి..

చివరి రోజు ఖమ్మంలో భట్టి పాదయాత్ర శ్రీశ్రీ సర్కిల్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా టీపీసీసీ నేతలు భట్టిని అభినందించారు. ఆయనకు రాహుల్‌గాంధీ శాలువాతో సన్మానం చేశారు. అలాగే తెలంగాణలో భారీ పాదయాత్ర చేసిన భట్టికి ధన్యవాదాలు చెబుతున్నట్లు రాహుల్‌గాంధీ ప్రస్తావించడంతో కాంగ్రెస్ శ్రేణులు చేసిన నినాదాలు మార్మోగాయి. అంతేకాకుండా భట్టితో కరచాలనం చేసిన రాహుల్‌గాంధీ ఆయనను తీసుకుని వేదిక ముందుకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. ఈ ఏడాది మార్చి 16న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన భట్టి పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 109రోజులు 1,360 కి.మీ.మేర సాగి తెలంగాణ జనగర్జన సభతో పూర్తయింది.

ఎన్నికల కదనరంగమై..

గత ఎన్నికల తర్వాత ఖమ్మం వేదికగా కాంగ్రెస్ భారీ ఎత్తున తెలంగాణ జనగర్జన సభ నిర్వహించింది. ఈ సభ నిజంగానే జనగర్జనగా మారిందని ఆ పార్టీ శ్రేణులు, నేతల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి అంతా ఈ సభ ఎన్నికల శంఖా రావమని, ఇక్కడి నుంచే బీఆర్‌ఎస్ పతనం ప్రారంభమవుతుందని వేదిక మీద ప్రకటించారు. దీంతో ఈ సభే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రేణులకు ఎన్నికల కదనరంగంగా మారిందని చెప్పవచ్చు. చాలాకాలం తర్వాత భారీ ఎత్తున సభ నిర్వహించడం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. మరోవైపు పార్టీ అధికారంలోకి రాగానే రూ.4 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు రాహుల్‌గాంధీ ప్రకటన చేశారు. దీంతో వచ్చే ఎన్నికల రిహార్సల్స్‌కు కాంగ్రెస్ ఖమ్మం వేదికగా ప్రధాన హామీ ఇచ్చినట్లు విశ్లేషణ జరుగుతోంది.



వేదికపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క, గద్దర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్, జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

పొంగులేటిని ఆప్యాయంగా ఆహ్వానించి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీలోకి ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆయనకు పార్టీ కండువా కప్పారు. పార్టీ నేత మధుయాష్కి, పొంగులేటితోపాటు ఎవరెవరు పార్టీలో చేరుతున్నారో వారి పేర్లను చదివారు. వారందరికీ రాహుల్‌గాంధీ పార్టీ కండువాలు కప్పారు. మరికొంత మందికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. పొంగులేటికి పార్టీ కండువా కప్పుతున్న సందర్భంగా ఆయన అభిమానులు జై శ్రీనన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీలో చేరుతున్న ముఖ్యనేతలను పొంగులేటితోపాటు రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీకి పరిచయం చేశారు. రాహుల్‌గాంధీ సభలో మాట్లాడుతూ కూడా పార్టీలోకి వచ్చిన పొంగులేటికి స్వాగతం అంటూ చెప్పారు. అలాగే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయం అంటూ పొంగులేటి గురించి మరోమారు ప్రస్తావించారు. దీంతో రాహుల్‌గాంధీ పీఎం, పీఎం అంటూ పొంగులేటి అనుచరులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

రాహుల్‌ను చుట్టుముట్టిన అభిమాన సంద్రం..

రాహుల్‌గాంధీ సభకు ముఖ్య అతిథిగా వస్తుండటంతో ఆయనను చూసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు సభా ప్రాంగణానికి పక్కనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు భారీగా చేరుకున్నారు. రాహుల్ హెలికాప్టర్ దిగి ఓపెన్‌టాప్ వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అభిమానులు ఆయనను చూసేందుకు వాహనం వెంబడి పరిగెత్తుకుంటూ రాగా పోలీసులు వారిని చెదరగొట్టారు. ఓ అభిమాని ఇచ్చిన పార్టీ జెండాను రాహుల్ చేత పట్టుకుని ఓపెన్ టాప్ వాహనంపై అభివాదం చేసుకుంటూ సభావేదిక వద్దకు వచ్చారు. 5.47 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ఆయన 5.55 నిమిషాలకు వేదిక పైకెక్కారు. ఆ తర్వాత సభికులకు అభివాదం చేశారు. గన్నవరం నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన ఆ తర్వాత రాత్రి 7.30 గంటలకు సభాప్రాంగణం నుంచి రోడ్డు మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌తో బోనకల్, చిల్లకల్లు మీదుగా విజయవాడ సమీపంలోని గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. సభ ముగించుకుని వెళ్తున్న రాహుల్‌గాంధీ కాన్వాయ్ వెంట అభిమానులు ప్రాంగణం దాటే వరకు పరుగులు తీశారు.

ఎవరెవరు పాల్గొన్నారంటే..

సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, గద్దర్, భువనగిరి, నల్లగొండ ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొదెం వీరయ్య, సీతక్క, సీనియర్ నేత రామ సహాయం సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, మాజీ మంత్రులు జానారెడ్డి, సంభాని చంద్రశేఖర్, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, దామోదర రాజనరసింహ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నేతలు కుసుమకుమార్, పున్నా కైలాష్‌నేత, పటేల్ రమేష్‌రెడ్డి, పోరిక బలరాం, పొన్నం ప్రభాకర్, జెడ్పీ చైర్మన్ కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, బొర్రా రాజశేఖర్, సూత కాని జైపాల్, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, విజయాబాయి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



బాకా ఊదుతున్న ఆదివాసీ కళాకారుడు

సభ.. సాగింది ఇలా...



సభావేదిక వద్ద సెల్ఫీ పాయింట్

- **మధ్యాహ్నం 3గంటల వరకు** సభాస్థలి ఖాళీగా ఉండగా.. ఆ తర్వాత కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు చేరుకోవడం ఆరంభమైంది.
- **3.30** గంటలకు కళాకారులు ధూంధాం ప్రారంభించారు.
- **సాయంత్రం 4.20 గంటలకు** సభావేదికపైకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేరుకుని కార్యకర్తలకు అభివాదం చేశారు.
- **సాయంత్రం 5 గంటలకు** మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభావేదిక వద్దకు చేరుకుని అభిమానులు, కార్యకర్తల రాకను పర్యవేక్షించారు.
- **5.18 గంటలకు** సభాస్థలికి కార్యకర్తలు భారీగా చేరుకుంటుండడంతో ప్రసంగాలు మొదలుపెట్టారు.
- **5.44 గంటలకు** గన్నవరం నుంచి ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ బయలుదేరిన హెలికాప్టర్ సభా మైదానం వద్దకు చేరుకోగా కార్యకర్తలు కేరింతలు కొట్టారు.
- **5.46 గంటలకు** హెలిప్యాడ్‌లో హెలికాప్టర్ దిగగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్వాగతం పలికి సభాస్థలికి తోడ్కొని వచ్చారు.
- రాహుల్‌ను చూసేందుకు పలువురు బారికేడ్లను తోసుకుంటూ వెళ్లడంతో పోలీసులు చెదరగొట్టారు.
- హెలిప్యాడ్ నుంచి రాహుల్ కారులో వస్తుండగా అభిమానులు, కార్యకర్తలు పరుగులు తీస్తుండడంతో ఆయన ఓపెన్ టాప్ వాహనం మీదుగా అభివాదం చేశారు. అంతేకాక కాంగ్రెస్ జెండా ఊపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.
- **5.55 గంటలకు** రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ సభావేదికపైకి చేరుకోగా.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాహుల్‌ను సత్కరించి శ్రీసీతారాముల ప్రతిమను అందజేశారు.
- **6 గంటలకు** సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగించుకుని జనగర్జన సభావేదిక పైకి వచ్చారు.
- **6.06 గంటలకు** పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాహుల్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు.
- **6.14 గంటలకు** పొంగులేటి తన ప్రసంగాన్ని ప్రారంభించి 14 నిమిషాల పాటు మాట్లాడారు. తాను కాంగ్రెస్‌లో ఎందుకు చేరానో కార్యకర్తలకు వివరించారు.
- **6.27 గంటలకు** పీపుల్స్ మార్చ్ పాదయాత్రను విజయవంతంగా ముగించిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను రాహుల్‌గాంధీ సన్మానించారు.
- **6.31 గంటలకు** భట్టి ప్రసంగం ప్రారంభించి 16 నిమిషాల పాటు మాట్లాడగా పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన పలు ఘటనలను వివరించారు.
- **6.48 గంటలకు** రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ప్రారంభించి 7.10 గంటల వరకు సభను ఉద్దేశించి ప్రసంగించారు. రాహుల్ గాంధీ హిందీ ప్రసంగాన్ని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు.
- రాహుల్ గాంధీ ప్రసంగం ప్రారంభమయ్యే సరికి వేదిక ముందు గ్యాలరీల్లో ఉన్న కార్యకర్తలు, అభిమానులు వేదిక ముందుకు చేరుకుని పీఎం .. పీఎం అంటూ నినాదాలు చేశారు.
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచి అమలుచేస్తామంటూ రూపొందించిన ప్లకార్డులను రాహుల్, రేవంత్‌రెడ్డి, భట్టి, తదితర నాయకులు ప్రదర్శించారు.
- **7.14 గంటలకు** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించి 7.21 గంటలకు ముగించారు.
- **సభ ముగించుకుని 7.22 గంటలకు** రాహుల్ గాంధీ సభావేదిక నుండి దిగి రోడ్డు మార్గంలో గన్నవరం బయలుదేరారు.



వేదికపై రాహుల్‌గాంధీతో కరచాలనం చేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

ఏపీ సీఎం జగన్‌ను విమర్శిస్తే సహించేది లేదు

అశ్వారావుపేటరూరల్: ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శిస్తే సహించేది లేదని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం మాజీ ఎంపీ రేణుకా చౌదరి ఏపీలో వైఎస్.జగన్ అధికారంలోకి వచ్చాకే పేద ప్రజలకు క్రమశిక్షణ లేకుండా పోయిందని.. ఈ ప్రభుత్వాన్ని చూసుకొని దళితులు, బీసీలు రెచ్చిపోతున్నారని వ్యాఖ్యానించడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ఆమెకు తగవని, కేవలం అగ్రకుల అహంకారంతోనే ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఏపీలో వైఎస్.జగన్ సుపరిపాలన అందిస్తుండగా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతి లేకుండా అందుతున్నాయని తెలిపారు. దీనిని ఓర్వలేక రేణుక వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా సోమవారం ఆషాఢ పూర్ణిమ సందర్భంగా దమ్మక్క సేవా యాత్ర నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు ఆదివారం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, కిలారు నాగేమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు పాల్గొన్నారు. కాగా, ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేయించుకోవాలన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చిన పర్యాటకులు డీర్ పార్క్‌లోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించి సందడిగా గడిపారు. 547 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,550, 280 మంది బోటింగ్ చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.14,210 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.


చెట్టెక్కిన అభిమానం

జనరణగర్జన


రాహుల్‌తో రేవంత్, సీతక్క, పొంగులేటి తదితరులు

కాంగ్రెస్, పొంగులేటి అభిమానులు చేయి చేయి కలిపి జనగర్జనకు తరలిరాగా ఖమ్మం జనసంద్రంగా మారింది. హస్తం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది. కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి తదితరులు మార్గనిర్దేశనం చేయగా.. ఖమ్మం మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి చేరిక కొండంత బలాన్నిచ్చింది. ఖమ్మం శివారులో ఆదివారం నిర్వహించిన జనగర్జన సభ రణగర్జనను తలపించింది. –సాక్షి నెట్‌వర్క్




బారికేడ్లను తోసుకుని సభా వేదికవైపు..




భట్టి పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, సంపత్, పొన్నం


రాహుల్ గాంధీ అభివాదం..


వైరా రోడ్‌లో ట్రాఫిక్ జామ్..


సభకు తరలివస్తున్న జనం


సభా ప్రాంగణంలో మతాబుల మిలమిల..

క్లుప్తంగా

ఆనందంలో అడవిబిడ్డలు

పోడు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే హరిప్రియ


టేకులపల్లి: సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

టేకులపల్లి/ఇల్లెందు రూరల్: ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆదివాసీ, గిరిజనులకు సీఎం కేసీఆర్ చొరవతో పోడు పట్టాలు అందాయని.. తద్వారా వారి జీవితాల్లో ఆనందం నిండిందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీల్లో ఆదివారం పర్యటించిన ఆమె పోడు రైతులకు పట్టాలు అందజేశారు. అలాగే, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశాక మాట్లాడుతూ.. పోడు పట్టాలతో ఆదివాసీ, గిరిజనులకు భూమిపై శాశ్వత హక్కు లభించిందని తెలిపారు. తద్వారా వారు ఎలాంటి సమస్య లేకుండా వ్యవసాయం చేసుకోవచ్చని, రైతు బంధు సాయం కూడా అందుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ భూక్యా రాధ, ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం, సర్పంచ్‌లు, నాయకులు లలిత, బిచ్చా, సరిత, లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, విజయలక్ష్మి, చీమల వెంకటేశ్వర్లు, వరప్రసాద్, బాలు, రామ, కిషన్, నరేశ్, మెట్టెల శిరోమణి, పూనెం లింగమ్మ, మెట్టెల కృష్ణ, దాస్యం ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న మాజీ స్పీకర్


ఆలయంలో మధుసూదనాచారి తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారిని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలకగా, అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ఉపాలయాల్లో కూడా పూజలు చేశారు. అలాగే, ఆదాయపన్ను శాఖ రాష్ట్ర కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

భద్రాచలంటౌన్/పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తోందని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. భద్రాచలం, పాల్వంచల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కులస్తులు రాజకీయాలకతీతంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, ఆయన భద్రాచలంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈ సమావేశాల్లో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులుతో పాటు రామోజీ రాముడు, అద్దంకి నాగేశ్వరరావు, చలపతి, రవీంద్రాచారి, వెంకటాచారి, నర్సింహాచారి, రాణిబండ రవీందర్, చింతోజు మాధవరావు, మారోజు సుదర్శన్, రవి, మొగిలోజు సీతారామాచారి, ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,623






జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు(భద్రాచలం), జారె ఆదినారాయణ (అశ్వారావుపేట)కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, చిత్రంలో పొంగులేటి

మొక్కుబడిగానే పోలీస్ బందోబస్తు

- రాహుల్‌కు జెడ్ కేటగిరీ భద్రత ఉన్నా పట్టించుకోని పోలీసులు
- ఎస్పీజీ కనుసన్నల్లో సభాస్థలి
- సభ ముగిశాక ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్

ఖమ్మంక్రైం/ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన తెలంగాణ ప్రజాగర్జన సభకు లక్షలాది మంది పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరుకాగా, పోలీసులు మాత్రం మొక్కుబడిగా విధులు నిర్వర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జెడ్ కేటగిరీ ఉన్నా ఆ స్థాయిలో పోలీసులు నిఘా ఏర్పాటు చేయలేదనే విమర్శలు వచ్చాయి. ఒక్కసారిగా వచ్చిన జనంతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయినా నియంత్రించలేని పరిస్థితి నెలకొని ఉంది. వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోవడంతో అటు పార్టీ శ్రేణులు, ఇటు సాధారణ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఎస్పీజీ నిఘా నీడలో..

జెడ్ కేటగిరి ఎస్కార్ట్ కలిగిన రాహుల్‌గాంధీ పర్యటనకు రెండు రోజుల ముందే 20 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఖమ్మం చేరుకున్నారు. సభాస్థలి, సభ ముగిశాక వెళ్లే రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. ఇక సభ జరుగుతుండగా కొందరు ప్రజల్లో కలిసిపోయి నిఘా వేశారు. రాహుల్‌గాంధీ వెంట ఐదుగురు కమాండర్లు బందోబస్తుగా హెలీకాప్టర్‌లో వచ్చారు. అనంతరం గన్నవరానికి రోడ్డు మార్గంలో వెళ్తుండగా ఆయనతోనే బయలుదేరారు.


వైరా రోడ్డులో నిలిచిపోయిన బస్సులు, వాహనాలు

కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు

పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో చేతులెత్తేశారని ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో పరిస్థితి చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. లక్షలాది మంది సభకు తరలిరావడంతో వారి వాహనాలను నియంత్రించడం కానీ పార్కింగ్ స్థలాలకు మళ్లించడంలో కానీ పోలీసులు శ్రద్ధ చూపలేదు. దీంతో వైరా రోడ్ అంతా ట్రాఫిక్ స్తంభించింది. సభ తేదీని ముందుగానే ప్రకటించినందున పోలీసులు రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని పలువురు పేర్కొన్నారు. సభ ముగిశాక వాహనాలన్నీ ఒకేసారి బయలుదేరడంతో రాత్రి 10 గంటల వరకు వైరా రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు కూడా అదే మార్గంలో వెళ్తుండడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అప్పటికే అక్కడ ఉన్న కాంగ్రెస్ వలంటీర్లు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంలో సహకరించారు. ఇక హెలీప్యాడ్ వద్ద కూడా ఎస్పీజీ కమాండెంట్లు మాత్రమే ఉండగా, స్థానిక పోలీసులు లేకపోవడంతో హెలీకాప్టర్ దగ్గరకు పలువురు వెళ్లి ఫొటోలు దిగేందుకు యత్నించారు. అయితే, చిన్నపిల్లలు, ఇతరులు తప్పిపోతే సమాచారం ఇచ్చేందుకు మాత్రం కొన్నిచోట్ల సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా ఇద్దరు అడిషనల్ డీసీపీలు, పది మంది ఏసీపీలు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినా పెద్దగా ఫలితం కనిపించలేదనే చెప్పాలి.

ప్రభుత్వం, పోలీశాఖ అవరోధాలు కల్పించాయి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య


ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో చర్చిస్తున్న పొదెం


తెలంగాణ జనగర్జన సభకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్న వాహనాలు

భద్రాచలంఅర్బన్: ఖమ్మం జనగర్జన సభకు ప్రజలు స్వచ్ఛందంగా వెళుతుంటే ప్రభుత్వం, పోలీసులు అవరోధాలు కల్పించారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆదివారం ఉదయం జనగర్జన సభకు వెళ్తున్న వాహనాలను భద్రాచలంలో అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మాట్లాడారు. ఎంపీవ తిరుపతితో మాట్లాడి సభకు వెళ్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న ప్రక్రియ సరైనది కాదని పేర్కొన్నారు.

పోలీసుల ఖండన.. ఎమ్మెల్యే వీరయ్యను అరెస్టు చేసినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడుగడుగునా అడ్డగింత

ఆర్టీఓ, పోలీసులతో జెడ్పీ చైర్మన్ వాగ్వాదం

ఇల్లెందు: ఖమ్మంలో రాహుల్ గాంధీ హాజరవుతున్న జనగర్జన సభ నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇల్లెందు–ఖమ్మం వెళ్లే వాహనాలను లలితాపురం వద్ద చెక్ పోస్టు పెట్టి ఇల్లెందు ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఇక టేకులపల్లి నుంచి ఇల్లెందుకు వచ్చే వాహనాలను టేకులపల్లి వద్ద తనిఖీ చేపట్టారు. గుండాల – ఇల్లెందు రోడ్‌ను మూసి వేశారు. ములుగు జిల్లా నుంచి భారీగా తరలి వస్తున్న వాహనాలను గుండాల కాచనపల్లి వద్ద తనిఖీ చేపట్టారు. బస్సులు, జీపులు, లారీలు, డీసీఎంలు, టాటా మ్యాజిక్‌లు, ఆటోలు వెళ్లకుండా తనిఖీలు చేస్తున్నారు. అకస్మాత్తుగా ఆర్టీఓ స్థాయి అధికారులు రంగంలోకి దిగి వాహనాల తనిఖీ చేపట్టడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్ కోసం అడ్వాన్స్ తీసుకున్న తాము అకస్మాత్తుగా వాహనాలు తనిఖీ చేస్తే తాము నష్టపోవాల్సి వస్తుందని, నెలలకు నెలలు వాహనాల జోలికి రాని ఆర్టీఓ అధికారులు అకస్మాత్తుగా తనిఖీ చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఖమ్మం సభ కోసం ఇల్లెందు నుంచి వందల సంఖ్యలో వాహనాలు రెడీగా, ఉండగా తనిఖీలతో ఆందోళనకు గురయ్యారు. లలితాపురం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులతో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వాగ్వాదానికి దిగారు.


లలితాపురం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మృత్యుంజయుడు..


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడుతున్న ఎలక్ట్రీషియన్ రాజశేఖర్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్

విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడిన ఓ ఎలక్ట్రీషియన్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన పోలూరి రాజశేఖర్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోని రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజులు పోయాయి. దీంతో ఆదివారం ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేస్తుండగా, విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడాడు. అక్కడే ఉన్న మర్రిగూడెం ఉప సర్పంచ్ వీరబోయిన వేణు లైన్‌మెన్‌కు ఫోన్‌లో సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనలో బాధితుని చేతికి గాయాలు కావడంతోపాటు , శరీరం స్వల్పంగా కాలింది. బాధితుడిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది. – అన్నపురెడ్డిపల్లి

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

బూర్గంపాడు: వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని సారపాక గ్రామపంచాయతీ విజయ్‌నగర్ కాలనీకి చెందిన గంగధారి రమేష్(49) ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం డ్యూటీకి వెళ్లకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు కూడా రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఆయనకు పలుమార్లు ఫోన్ చేశారు. కానీ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఆదివారం మోతె గ్రామంలో రహదారి పక్కన ఓ గుడిసెలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించి రమేష్ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుని కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

చెక్‌డ్యామ్‌లో పడి యువకుడు...

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు చెక్ డ్యామ్ నీటిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సోములగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సోములగూడెం గ్రామానికి చెందిన కొక్కు శ్రీను(35) కేటీపీఎస్‌లో ఆర్టిజన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులకు సెలవు కావడంతో తాను తర్వాత వస్తానంటూ భార్య, కుమారుడిని పాల్వంచ నవభారత్ ఏరి యాలో ఉన్న ఆమె పుట్టింటికి పంపాడు. అనంతరం గ్రామశివారులోని చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగిపోయాడు. సమీపంలో ఉన్న రైతు గమనించి సమాచారం ఇవ్వగా స్థానికులు, కుటుంబ సభ్యులు వెళ్లి నీటిలోపడ్డ శ్రీనును బయటకు తీశారు. చికిత్స నిమిత్తం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ.శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

దమ్మపేట: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నెమలిపేటకు చెందిన తాటి రాజు(36) గత నెల 23న ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి అప్పారావుపేట గ్రామం వైపునకు అతివేగంతో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లారం గ్రామం వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కనే ఉన్న బండరాయిని బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా, స్థానికులు క్షతగాత్రుడిని దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఉద్యోగం ఇస్తామంటూ..

నమ్మబలికి నగదు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

దమ్మపేట: సైబర్ నేరంపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నాచారం గ్రామానికి చెందిన గంధం సాయిజ్యోత్స్నకు గత నెల 14న గుర్తు తెలియని నంబరు నుంచి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. పార్ట్ టైమ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, అందుకు కొంత నగదు బదిలీ చేయాలని, తర్వాత తిరిగి చెల్లిస్తామంటూ నమ్మబలికారు. నమ్మిన జ్యోత్స్న వారికి విడతల వారీగా రూ.1,83,000 నగదు బదిలీ చేసింది. కాగా వారు కేవలం రూ.36,000 మాత్రమే తిరిగి ఆమెకు పంపించారు. మిగతా నగదును చెల్లించకపోవడంతో మోసపోయానని గ్రహించిన జ్యోత్స్న ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా, సైబర్ నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ.40,000 హోల్డ్‌లో పెట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.